క్లుప్తంగా

సీఐటీయూ పోరాట ఫలితమే కార్మికుల వేతనాల పెంపు

బెజ్జూర్: సీఐటీయూ పోరాట ఫలితంగానే ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలను పెంచడం జరిగిందని సీఐటీయూ జిల్లా నాయకుడు వెలిశాల క్రిష్ణమాచారి అన్నారు. వేతనాల పెంపుపై గురువారం బెజ్జూర్ మండలంలో మధ్యాహ్న భోజన కార్మికులు విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మధ్యా హ్న భోజన కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేయడం జరిగిందని గుర్తు చేశారు. రూ. వెయ్యి నుంచి రూ.3 వేలకు మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలను ప్రభుత్వం పెంచిందని తెలిపారు. జీఓను గత సంవత్సరం మార్చి 15న అసెంబ్లీలో ప్రకటించిన నాటి నుంచి అమలు చేస్తూ ఏరియర్స్‌తో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు వేతనాల పెంపు జీవో కోసం పోరాటాలు చేసిన మధ్యాహ్న భోజన కార్మికుల అభినందన సభ నిర్వహించడం జరిగిందన్నారు. అంతకుముందు మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం ముందు బాణసంచాలు పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. ఈ నెల 15న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర కమిటీ సమావేశానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ గోరంట్ల వసంత్, మధ్యాహ్న భోజన పథకం సంఘం నాయకులు, ఆలం పూల బాయి, బాయక్క, శారద, నిర్మల, గావు దేరమాదేవి, పద్మ, బోరెం సాలక్క పాల్గొన్నారు.

రేపు జాతీయ లోక్ అదాలత్

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టులో ఈ నెల 11న శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మెజిస్ట్రేట్ రవి ఒక ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు రాజీపడి తమ కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్లలో సంప్రదించి కక్షిదారులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలు చేపట్టాలి

తాండూర్: సింగరేణిలోని పలు ఏరియాల్లో విధులు నిర్వర్తిస్తున్న సీనియర్ క్లరికల్ స్టాఫ్‌కు వెంటనే కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీల ప్రక్రియ చేపట్టాలని పలువురు క్లరికల్ సిబ్బంది డిమాండ్ చేశారు. యాజమాన్యం అవలంబిస్తున్న తీరును నిరసిస్తూ బీపీఏ ఓసీపీ-2 క్లరికల్ సిబ్బంది గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గని మేనేజర్ మహేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా చేపట్టబోయే క్లరికల్ ఖాళీల భర్తీ ప్రక్రియకు ముందే సీనియర్ క్లరికల్‌కు అవకాశం కల్పించాలని కోరారు. క్లరికల్ సిబ్బంది నిరసనకు ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు సిద్దంశెట్టి రాజమోగిళి, బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్‌లు సంఘీభావం తెలియజేశారు. క్లర్కుల న్యాయమైన డిమాండ్లను వెంటనే యాజమాన్యం పరిష్కరించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీనియర్ క్లర్కులు రాజేందర్, రాజన్న, కుమార్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ దళితులను ఆదుకోవాలి

నార్నూర్: ఏజెన్సీ దళితులను ప్రభుత్వం ఆదుకోవాలని నేతకాని మహర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాడి నర్సయ్య డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో నిర్వహించిన నేతకాని మహర్ సంఘం సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దళితులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు హక్కుపత్రాలు అందించాలన్నారు. మహర్ కుల ధ్రువీకరణ పత్రాలు ఆర్డీవో ద్వారా కాకుండా తహసీల్దార్ ద్వారా ఇవ్వాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులతో సమాన హక్కులు కల్పించాలని, దళితబంధు పథకాన్ని అర్హులందరికీ అందించేలా చూడాలన్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి రామారావు, జిల్లా అధ్యక్షుడు కాంబ్లే భీంరావు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ జిల్లా సభ్యులు భూమన్న, యశ్వంత్ రావ్ పాల్గొన్నారు.

మైనార్టీ రుణాల లక్కీడ్రా వాయిదా

నార్నూర్: మైనార్టీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని లక్కీడ్రా పద్ధతిలో ఎంపిక చేసే కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీవో కావల రమేశ్ తెలిపారు. మండలానికి మూడు యూనిట్లు మంజూరు కావడంతో లక్కీడ్రాను వాయిదా వేయాలని మైనార్టీలు ఆందోళనకు దిగారు. తదుపరి తేదీని త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఎంపీపీ కనక మోతుబాయి, సహకార సంఘం చైర్మన్ ఆడే సురేశ్, అబేదా ఖానం, సర్పంచ్ గజానంద్ పాల్గొన్నారు.

పోడుభూముల పట్టాలివ్వాలి

భీమారం: మండలంలోని మద్దికల్ గ్రామంలో పోడుభూములకు పట్టాలివ్వాలని తుడందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్రం వెంకటరాజం గురువారం డిమాండ్ చేశారు. మండలంలోని మద్దికల్ గ్రామంలోని ఆదివాసీలు అనేక సంవత్సరాలుగా అటవీభూముల్లో పోడు వ్యవసాయం చేసుకుంటున్నారని, అటవీశాఖ అధికారులు ఆ భూములను స్వాధీన పర్చుకొని ప్లాంటేషన్స్ పెంచుతున్నారన్నారు.

పాఠశాల ప్రగతికి 'యూడైస్ ప్లస్'

- ప్రొఫార్మా పూరించడం ఆన్‌లైన్‌లోనే
- పాఠశాల వనరుల నమోదు
- హెచ్‌ఎంలకు అప్పగించిన బాధ్యత
- రెండు రోజుల్లో సరిచేసి ఇవ్వాలని ఆదేశం


యూడైస్‌ప్లస్‌పై అవగాహన కల్పిస్తున్న ఎంఈవో

కెరమెరి: పాఠశాల అభివృద్ధికి, పాఠశాలల్లోని వనరులను తెలుసుకుని రానున్న రోజుల్లో సౌకర్యాలను కల్పించేందుకు ఉపయోగపడేదే యుడైస్ ప్లస్. గతంలో యూడైస్ (యూనైటెడ్ డిస్ట్రిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్) ఉంటే.. ప్రస్తుతం దాన్ని కేంద్ర ప్రభుత్వం యూడైస్ ప్లస్‌గా మార్చింది. పాఠశాలకు సంబంధించిన వనరుల గురించి పూర్తి స్థాయిలో పూరించాల్సి ఉంటుంది. పాఠశాలల్లో ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రధానోపాధ్యాయకులు అధికారులు సూచిస్తున్నారు.

ప్రధానోపాధ్యాయులకు అవగాహన..

మండలంలో మొత్తం 98 పాఠశాలలు ఉండగా.. 5834 మంది విద్యార్థులు ఉన్నారు. 254మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఎంఆర్‌సీ సిబ్బంది స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్ నుంచి నుంచి యూడైస్ ప్రొఫార్మాను డౌన్‌లోడ్ చేసుకుని సరిచేసుకునేందుకు కోసం ఉపాధ్యాయులకు ఇచ్చేవారు. ఆ ప్రొఫార్మలోని వివరాలు సరైనవో కాదో సరిచేసి ఇచ్చారు. కానీ ఈసారి నేరుగా ప్రత్యేకంగా యుడైస్‌ప్లస్ వెబ్‌సైట్ నుంచి ఆయా పాఠశాలల హెచ్‌ఎం తమ లాగిన్‌తోనే డీసీఎఫ్ ఫారం డౌన్‌లోడ్ చేసే వెలుసుబాటును కల్పించారు. ఈ విషయమై గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ప్రత్యేక అవగాహన కల్పించారు.

డేటా నమోదు ఇలా...

1. ముందుగా యూడైస్‌ప్లస్.గావ్.ఇన్ అనే వెబ్‌సైట్‌లోకి వెళ్లి లాగిన్ కావాలి.
2. ప్రొఫైల్ అండ్ ఫెసిలిటీస్‌లోకి వెళ్లి యూజర్ ఐడి (డైస్‌కోడ్) ఎంటర్ చేయాలి.
3. ఎంటర్ పాస్ వర్డ్ నమోదు చేయడంతో మొబైల్‌కి పాస్‌వర్డ్ వస్తుంది. ఒక వేళ పాస్‌వర్డ్ మొబైల్‌కి రాకపోతే ఎంఐస్ లేదా డాటా ఎంట్రీ ఆపరేటర్‌ని సంప్రదించాలి.
4. పాస్‌వర్డ్ వచ్చిన తరువాత రెడ్ కలర్‌లో కనిపించే క్యాప్చ ఎంటర్ చేయాలి. ఈ చర్యలతో స్కూల్ ప్రొఫైల్‌లోకి లాగిన్ అవుతుంది.
5. ముందుగా డీసీఎఫ్‌ను డౌన్‌లోడ్ చేయాలి (డిస్‌ప్లేలో కన్పించే డౌన్‌లోడ్ ప్రొఫైల్ డీసీఎఫ్ ఫైల్)
6. డౌన్‌లోడ్ చేశాక కరెక్షన్ చేసుకుని తమ వద్ద పెట్టుకుని వాటిని డాటాఎంట్రీ చేయాల్సి ఉంటుంది.



యూడైస్ ప్లస్ వెబ్‌సైట్

రెండు రోజుల్లో సమర్పించాలి



యూడైస్ ప్లస్ ప్రొఫార్మను రెండు రోజుల్లో కాంప్లెక్స్‌లో సమర్పించాలి. ఎలాంటి తప్పులు దొర్లకుండా పూరించాలి. ఏదైన తప్పు జరిగితే హెచ్‌ఎందే బాధ్యత. వనరులకు సంబంధించిన వివరాలు పూర్తి స్థాయిలో నమోదు చేయాలి.

– కుడ్మెత సుధాకర్, ఎంఈవో కెరమెరి

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల నిరసన


నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

కాగజ్‌నగర్‌టౌన్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కాగజ్‌నగర్ మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని వాపోయారు. దీంతో ఆర్థికంగా అనేక ఇబ్బందులకు గురవుతున్నామని వివరించారు. ఈఎస్‌ఐ, పీఎఫ్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకుంటే సోమవారం నుంచి నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి


కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోలర్ అధికారి

బెజ్జూర్: కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని క్వాలిటీ కంట్రోలర్ అధికారి డాక్టర్ రాధిక అన్నారు. బెజ్జూర్ మండల కేంద్రంతో పాటు తలాయి గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటి సమస్యలు ఉన్న ప్రతిఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేయడంతో పాటు శస్త్ర చికిత్సలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పరీక్షలు చేయించుకొని అంధత్వ నివారణకు సహకరించాలన్నారు. ఆమె వెంట డాక్టర్ సాయి కృష్ణ గౌడ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత


మెటీరియల్ పంపిణీ చేస్తున్న టీచర్లు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆంగ్ల స్టడీ మెటీరియల్‌ను అదే పాఠశాల పనిచేస్తున్న ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు గురువారం అందజేసినట్లు హెచ్‌ఎం సుభాష్ తెలిపారు. పాఠశాలలో 52మంది విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్లు ప్రభోద్ కుమార్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

రానున్న కాలం కాంగ్రెస్‌దే

- పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సరస్వతి


ప్రజలతో మాట్లాడుతున్న సరస్వతి

కెరమెరి: రానున్న కాలం కాంగ్రెస్ పార్టీదేనని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్సకోల సరస్వతి అన్నారు. గురువారం జైనూర్ మండల కేంద్రంతో పాటు మార్లవాయి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండాలను ఎరుగువేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాహుల్‌గాంధీ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేపట్టి ప్రజల సమస్యలను తెలుసుకున్నారని, అందులో భాగంగానే రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాత్ సే హాత్ జోడో అనే యాత్ర చేపట్టారని తెలిపారు. ఆ యాత్రకు సంఘీభావంగా గడపగడపకూ కార్యక్రమంలో ప్రతి ఇంటికి తిరిగి ప్రజలు సమస్యలను తెలుసుకుంటున్నామని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.15వేలు రైతుబంధు ఇస్తామని, ఇందిరమ్మ గృహాలను అందిస్తామన్నారు. 9ఏళ్ల బీజేపీ ప్రభుత్వ పాలనలో ఎన్నో వైఫల్యాలు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముఖీబ్, రఫీక్, కోటేశ్, ఇస్లామ్, గోవింద్‌రావు, లింగు ఉన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత


నిత్యావసర సరుకులు అందజేస్తున్న గ్రామస్తులు

తిర్యాణి: ఇటీవల మండలంలోని పంగిడిమాదర గ్రామపంచాయతీ పరిధిలోని సల్పాలగూడ గ్రామంలో నాలుగు కుటుంబాలు అగ్ని ప్రమాదంలో సర్వం కోలుపోగా వారికి మండలంలోని గడలపెల్లి గ్రామానికి చెందిన ప్రజలు అండగా నిలిచారు. గురువారం బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులతో పాటుగా, దుస్తులు, వంటపాత్రలను అందజేశారు. సర్పంచ్ మడావి గుణవంత్‌రావు, గడలపెల్లి గ్రామస్తులు కుర్సెంగ మోతిరాం, సోయం కట్టి, సిడాం అనంత్‌రావు, లక్ష్మణ్ ఉన్నారు.

ఆహ్లాదం పంచుతున్న వృక్షాలు



కెరమెరి: రోడ్డుకు ఇరువైపులా వృక్షాలు.. వాటి మధ్యలో సీసీ రోడ్డు.. ఈ రెండింటి కలయిక చూపరులను ఆహ్లాదపరుస్తున్న ఈ చిత్రం మండలంలోని సావర్‌కెడా గ్రామానికి ప్రవేశ ద్వారం. ఈ గ్రామం ఎంత శుభ్రంగా ఉందో తెలియడానికి ఈ చిత్రమే ప్రతిరూపం. కొన్నేళ్ల క్రితం నాటిన మొక్కలు నేడు వృక్షాలై నీడను, అందాన్ని ఒలకబోస్తున్నాయి.

'పది' విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ


పరీక్ష ప్యాడ్‌లు ఇస్తున్న ట్రస్టు సభ్యులు

దహెగాం: మండల కేంద్రంలోని స్థానిక ప్రైవేటు పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు పుప్పాల మల్లక్క ట్రస్టు ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ పుప్పాల శ్రీనివాస్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల సమయం దగ్గర పడుతున్నందున విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. 36మందికి ఉచితంగా ప్యాడ్‌లు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షారూన్, సభ్యులు లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

ఆరోగ్యానికి పోషకాహార పానీయం

- ఎంఈవో కె.సుధాకర్


రాగిజావను పరిశీలిస్తున్న ఎంఈవో

కెరమెరి: ఆరోగ్యానికి పోషకాహారం పానియం ఎంతో ముఖ్యమని మండల విద్యాధికారి కుడ్మెత సుధాకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న రాగి జావ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇది దినం తప్పి దినం అందించే కార్యక్రమని, ప్రతి విద్యార్థికి పది గ్రాముల రాగి జావ అందించాలని చెప్పారు. శ్రీ సత్యసాయి ట్రస్ట్ ద్వారా ఉచింతగా అందిస్తున్నట్లు తెలిపారు. రక్తహీనతతో బాధపడే వారికి రాగి జావ బలం చేకూరుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్, హెచ్‌ఎం భాస్కర్, అజయ్ ఉన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం


బహుమతులు ప్రదానం చేస్తున్న నాయకులు

పెంచికల్‌పేట్: క్రీడల్లో గెలుపోటములు సహజమని బీజేపీ నేత పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న పాల్వాయి పురుషోత్తంరావు స్మారక క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. ఈ పోటీల్లో గెలుపొందిన గొంట్లపేట్ జట్టుకు, రన్నరఫ్‌గా నిలిచిన ఎల్కపల్లి జట్టుకు నగదుతో పాటు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. యువత క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, భీమయ్య, నగేష్, వెంకన్న, శంకర్‌గౌడ్, శ్రీనివాస్, చందు, కాంతరావు, సంతోష్, బాపూజీ, సంజీవ్, కమలాకర్ పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలి


పరీక్ష ప్యాడ్లు ఇస్తున్న టీచర్ చంద్రశేఖర్

కాగజ్‌నగర్‌టౌన్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని జాగృతి కుమురంభీం జిల్లా అధ్యక్షుడు, పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు, గణిత ఉపాధ్యాయుడు పర్శ చంద్రశేఖర్ అన్నారు. గురువారం కాగజ్‌నగర్ ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, నోట్ బుక్‌లు, పెన్నులను పంపిణీ చేశారు. అనంతరం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాడి దేవాజి మాట్లాడుతూ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పి.శ్రీధర్, వి.శ్యామ్ రావు, ఎస్.వేణు, మాధవి, జంగు, నవ్య పాల్గొన్నారు.

పంటకు చీరే రక్ష





కెరమెరి: మండలంలోని కెలికే, లేండిగూడ, మెట్టపిప్రి, ధనోరా, సావర్‌కెడా, అనార్‌పల్లి గ్రామాల మధ్యలోని పత్తి, జొన్నపంటలకు రక్షణగా రైతులు చీరలను అడ్డుగోడలుగా క(చు)డుతూ పంటలను రక్షించుకుంటున్నారు.. పందులు, కోతులు పాటు ఇతర జంతువులు పంటలను నాశనం చేస్తున్నాయని, పంటలను కాపాడుకునేందుకు ఈ ఉపాయం చేస్తున్నారు.

పనులు ప్రారంభం

కాసిపేట: మండల కేంద్రం నుంచి అశోక్‌నగర్‌కు వెళ్లే వాగుపై నూతనంగా బ్రిడ్జి నిర్మించడానికి రూ.3 కోట్ల నిధులు మంజూరు కాగా గురువారం ఎంపీపీ రొడ్డ లక్ష్మి పనులను భూమి పూజ చేసి ప్రారంభించారు. జెడ్పీటీసీ చంద్రయ్య, వైస్ ఎంపీపీ ఉన్నారు.